క్లుప్తంగా

'నాణ్యతలో రాజీ పడొద్దు'

కుందుర్పి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద నాణ్యతలో రాజీపడొద్దని ఎంఈఓ తిప్పేస్వామి, పేరెంట్స్ కమిటీ చేర్‌పర్సన్ వరలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం రోజూ జగనన్న గోరుముద్ద అందజేయాలన్నారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర, సీఆర్‌పీ మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల డ్యాన్స్ అదుర్స్



నృత్యం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో క్యాడెట్లకు శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. క్యాడెట్లు సినీ పాటలకు స్టెప్పులు అదరగొట్టారు. క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఎస్‌ఎం కేకే సింగ్ తదితరులు పాల్గొన్నారు. కాగా క్యాంప్‌లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు.

ఢిల్లీకి కలశంలో మట్టి తరలింపు



ఢిల్లీకి మట్టి తరలిస్తున్న ఎంపీడీఓ

కూడేరు: 'మేరా మట్టి, మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపుతున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా శుక్రవారం తెలిపారు. సేకరించిన మట్టిని ఎంపీడీఓ కార్యాలయానికి తీసుకువచ్చి కలశంలో ఉంచి పూజలు నిర్వహించారు. వలంటీర్ మోహన్ కృష్ణారెడ్డికి ఆ కలశాన్ని అందజేసి ఢిల్లీకి రైలులో తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవా, ఏఓ నాగభూషణ రెడ్డి, పీడీ అక్కులప్ప, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదం పంపిణీ

ఉరవకొండ: పట్టణ శివారులో మిరప పంట సాగుచేస్తున్న రైతులకు జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు అధ్వర్యంలో ప్రజాప్రతినిధులు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్మరణ వారోత్సవం



మాట్లాడుతున్న ఎస్ఐ సుధాకర్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక రూరల్, టౌన్ పోలీస్ స్టేషన్లో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల, కరణం చిక్కప్ప పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ హరినాథ్, ఎస్ఐ సుధాకర్ మాటాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

కూడేరు: పోలీసు అమరవీరుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూడేరు పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగించే ఆయుధాలు, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్ పరికరాలు, ఇతర సామగ్రి, లాకప్, ఆపద సమయంలో దిశ యాప్‌ను ఏవిధంగా వినియోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు అక్రమ్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ గ్రామోత్సవం



గౌరమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: మండల పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి గౌరమ్మ దేవత గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా చందాలు వేసుకుని సుమారు లక్ష రూపాయలతో గౌరమ్మ ఉత్సవ విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేయించారు. పంచలోహ విగ్రహాన్ని బాలికల హారతుల నడుమ గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గౌరమ్మ అమ్మవారి నామస్మరణ మార్మోగింది. తర్వాత ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సచివాలయాలే దేవాలయాలు

- ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు, పైలా, గిరిజమ్మ

బొమ్మనహాళ్: ప్రజలకు చేరువుగా ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ సచివాలయాలు గ్రామీణులకు దేవాలయాలుగా మారాయని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని బండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దేవగిరి గ్రామంలో గ్రామ సచివాలయం, డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లను సర్పంచ్ రాధిక అధ్యక్షతన వారు ప్రారంభించారు. ముందుగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవలు అందాలంటే గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చి ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, వ్యవసాయ పరికరాలు అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని కుట్రలు చేసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని వారు పిలుపు నిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయంలో కేవలం టీడీపీ అనుచరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందాయని విమర్శించారు.

భువనేశ్వరి యాత్ర పేరు మార్చుకోవాలి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికి చంద్రబాబు జైలుకి వెళ్లారని, నిప్పు అని చెప్పుకునే బాబు అవినీతి సొమ్ముతోనే పెద్ద పెద్ద న్యాయవాదులను తన తరఫున వాదనలకు ఏర్పాటు చేసుకోవడం ప్రజలు గమనిస్తున్నారని విప్ కాపు స్పష్టం చేశారు. అన్ని ఆధారాలు ఉండబట్టే బాబు జైలు పాలయ్యారని, ఆలస్యమైనా చివరికి నిజమే గెలిచిందన్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి చేపట్టిన యాత్ర పేరును అబద్ధమే గెలవాలి అని మార్చుకోవాలన్నారు. పేదల కోసం చంద్రబాబు ఏ రోజూ పని చేయలేదని, పెత్తందారుల కోసమే ఆయన తపనంతా అని వివరించారు. నిత్యం పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజునాయక్, ఎంపీపీ పద్మ, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఉపేంద్రరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రామాంజనేయులు, ఎంపీడీఓ షకీలాబేగం, తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, లోకేష్, మనోహర్ శెట్టి, వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ హనుమేష్, సర్పంచ్‌లు తిప్పేస్వామి, పరమేశ్వర, యోగేశ్వరరెడ్డి, కోఆప్షన్‌మెంబర్ మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

వాల్మీకుల ద్రోహి కాలవ శ్రీనివాసులు

- స్వార్థ రాజకీయాల కోసం కులానికి కాలవ వెన్నుపోటు
- వాల్మీకుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి
- ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం
- నేడు వాల్మీకి జయంతికి ఘనంగా ఏర్పాట్లు
- విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాష్ట్రంలో వాల్మీకులకు ద్రోహం చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే టక్కును గుర్తొచ్చేది టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులేనని, కులాన్ని అడ్డుపెట్టుకుని పదవులు అనుభవించి ఆ కులానికే వెన్నుపోటు పొడిచేలా కిరాతకంగా వ్యవహరించాడని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఈ మాటను తాము అనడం లేదని వాల్మీకులే ముక్తకంఠంతో కాలవ తీరును ఖండిస్తున్నారని విరుచుకుపడ్డారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు పైతోట సంజీవ, హనుమంతరాయుడు, పవన్, మల్లికార్జున, ఓబనాగరాజుతో కలసి విప్ మాట్లాడారు.. 14 ఏళ్లు అధికారం అనుభవించిన చంద్రబాబు ప్రతి ఎన్నికల్లోనూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామంటూ నిలువునా మోసం చేస్తే, దానికి వంతుపాడేలా మురికి కాలువ వ్యవహరించాడన్నారు. ఈ జాతి ద్రోహులను నేను సూటిగా ఒక్కటే ప్రశ్నిస్తున్నాను.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం కేంద్ర పరిధిలో ఉంటుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. గతంలో బీజేపీతో కలసి టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం 2014లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో బీజేపీ మంత్రులు, కేంద్ర క్యాబినెట్‌లో టీడీపీ మంత్రులు ఉండేవారు. ఆ సమయంలో ఎస్టీ జాబితాలో చేర్చేందుకు మార్గం సుగమమయ్యేది. చిత్తశుద్ధి ఉంటే ఆ రోజుల్లో ఈ ద్రోహులు ఎందుకు పోరాటం చేయలేకపోయారని నిలదీశారు. మళ్లీ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ వాల్మీకుల ఓట్ల కోసం మొసలికన్నీరు కార్చే స్థితికి దిగజారి పోతున్నారని ధ్వజమెత్తారు. వాల్మీకులను సామాజికంగా, రాజకీయంగా ఎదగనీకుండా కాలవ శ్రీనివాసులు తొక్కిపెట్టారన్నారు.

వాల్మీకుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

దేశంలోనే ఎక్కడా లేని విధంగా బోయ/వాల్మీకుల సంక్షేమానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని విప్ కాపు అన్నారు. వాల్మీకుల అభివృద్ధి కోసం ఆడపడుచులకు ఆసరా, చేయూత, అమ్మఒడి, సామాజిక పింఛన్లు లాంటి పథకాలు అందించి ఆదుకున్నారని కొనియాడారు. ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు మంత్రి, జిల్లాలో ఎంపీ, ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ తదితర కీలక పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం జగన్ కే దక్కిందన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చే విషయం పై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. టీడీపీకి లబ్ధి చేకూర్చేందుకే కొందరు రాష్ట్ర ప్రభుత్వం పై అభాండాలు వేసేలా కుట్రలు చేస్తున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించేలా సీఎం జగన్ మార్గదర్శకాలు జారీ చేస్తే, వైఎస్సార్‌సీపీకి ఎక్కడ లబ్ధి చేకూరుతుందోనని కొందరు బహిష్కరిస్తామంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గాంధీ సర్కిల్ వద్ద తొలగించిన వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించేలా కృషి చేయాలని, లేని పక్షంతో సొంత ఖర్చులతో వాల్మీకులతో కలసి తానే ఏర్పాటు చేస్తానని విప్ కాపు ప్రకటించారు.

నేడు వాల్మీకి జయంతి

పట్టణంలో శనివారం ఘనంగా వాల్మీకి జయంతి నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేపట్టామని విప్ కాపు తెలిపారు. ముందుగా పైతోటలో నిర్వహించే భారీ ర్యాలీలో పాల్గొని అక్కడే ఏర్పాటు చేస్తున్న మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గం వ్యాప్తంగా ఉండే వాల్మీకులంతా పెద్ద ఎత్తున తరవచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, మాజీ కన్వీనర్ ముస్తాక్, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు పైతోట సంజీవ, పీ గోవిందరాజులు, డిష్ గోవిందు, ఐనాపురం మంజు, బషీర్, వన్నూరప్ప, ఆయా గ్రామాల వాల్మీకి సంఘం నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సీజనల్ వ్యాధులపై ఎంపీపీ చందా చంద్రమ్మ, ఎంపీడీఓ అమృత్‌రాజ్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హాజరై డెంగీ, మలేరియా నివారణ చర్యలకు సంబంధించి కరపత్రాలను అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్యసిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, పీఆర్ జేఈ మధు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పొందించుకుని భక్తిమార్గంలో నడవాలని వివిధ మఠాల పీఠాధిపతులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గంజికుంట గ్రామంలోని ఉమామహేశ్వర గురుపీఠం (ప్రణవానంద ఆశ్రమం)లో ఆశ్రమ ధర్మకర్త మఠం ఉమాదేవి ఆధ్వర్యంలో శివ స్వరూపా నందగిరి గురు వరస్వాములవారి 26వ పుణ్యారాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు ప్రణవానందగిరి గురుస్వామి, కరిబసవ రాజేంద్రమహాస్వామి, అనంతానందగిరిమాతాజీ, గురుచరణానందగిరి మాతాజీ, శివానందస్వామి, గురుసేవానందస్వామి హాజరయ్యారు. మఠాలపీఠాధిపతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు హరిప్రసాద్, తట్రకల్లు రామలింగ, విశ్వనాథ్, ఎర్రిస్వామి, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న వివిధ మఠాల పీఠాధిపతులు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

విడపనకల్లు: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అభిషేక్, ఉమేష్, శశిధర్, కుమారుస్వామి, మేఘన, సుకన్య అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు నందు, వినయ్, శశికుమార్, జుబేదాభాను, శశికళ, ప్రియాంక ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాల తరఫున 13 మంది రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకూ అనకాపల్లిలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని పీడీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పంటలు పూర్తయ్యేవరకూ సాగునీరు ఇవ్వాలి

విడపనకల్లు: హంద్రీనీవా, హెచ్చెల్సీ, జీబీసీ కెనాల్ కింద మిరప, పత్తి, వరి తదితర పంటలు రైతులు సాగు చేశారని, పంటలన్నీ పూర్తయ్యే వరకూ సాగు నీరు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం, కార్మిక సంఘం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, కృష్ణమూర్తి, శీనప్ప తదితరలు డిమాండు చేశారు. శుక్రవారం మండలంలోని చీకలగురికి, పాల్తూరు, ఉండబండ, కరకముక్కల, హావళిగి తదితర గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం, కార్మిక సంఘం నాయకులు బైకు జాతా కార్యక్రమం నిర్వహించారు.

భూ సర్వే వేగవంతం చేయండి

కుందుర్పి: జగనన్న శాశ్వత భూ సర్వే భూహక్కు పథకం కింద చేపడుతున్న సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయకుమారి, సర్వే డీటీ కుళ్లాయప్ప సూచించారు. శుక్రవారం బెస్తరపల్లి, కెంచంపల్లి తదితర గ్రామాల్లో భూ సర్వే నిర్వహించారు. అనంతరం రైతులతో సమీక్ష నిర్వహించి భూ సర్వే వివరాలను తెలియజేశారు. ఇప్పటికే ఎస్.మల్లాపురం రెవెన్యూ గ్రామంలో భూ సర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం నిజవళ్లి, జంబుగుంపల, బెస్తరపల్లి, కరిగానిపల్లి రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. సర్వేకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ఓబుళేసు



రాయదుర్గం: రాయదుర్గం తహసీల్దార్‌గా డి.ఓబుళేషు శుక్రవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం బెళుగుప్ప తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి దాకా ఇక్కడ విధుల్లో ఉండే తహసీల్దార్ మారుతి అనంతపురం కోనేరు రంగారావు సిఫార్సు కమిటీ (కేఆర్‌సీసీ)కి బదిలీపై వెళ్లారన్నారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ విలేకరులతో మాట్లాడారు.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనకు డీటీ, కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'సురక్ష' పేదలకు వరం

కంబదూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలందరికీ వరమని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, వైస్ ఎంపీపీ బీమేష్, సర్పంచ్ అమర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాళ్ల అనంతపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఆసియ, ప్రసన్నకుమార్, ప్రవీణ్‌కుమార్ సుమారు 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదెప్ప, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతుల పరిశీలన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యోగా తరగతులను శుక్రవారం ఎంఈఓలు విజయ్ కుమారి, బాబు పరిశీలించారు. వారు మాట్లాడుతూ. యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌ను సరిచూసుకోవాలి

గుమ్మఘట్ట: రైతులు ఈ-క్రాప్‌బుకింగ్‌ను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్ సూచించారు. మండల వ్యాప్తంగా వున్న ఆర్బీకేల్లో రైతుల జాబితాను ప్రదర్శనకు సిద్ధంగా ఉంచామన్నారు. రైతులకు ఏమైనా సందేహాలుంటే ఆర్బీకే సిబ్బందికి ఈ నెల 29లోగా ఫిర్యాదు చేయాలన్నారు.

కూడేరు: రైతు భరోసా కేంద్రాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు జాబితాను పొందుపరిచాం. రైతులు జాబితాను సరి చూసుకోవాలని ఏఓ విజయ కుమార్, ఏఈఓ శైలజ శుక్రవారం సూచించారు.

పెరిగిన మిరప సాగు

కంబదూరు: మండలంలో మిరప సాగు గణనీయంగా పెరిగిందని ఉద్యానశాఖ జిల్లా సహాయ సంచాలకుడు నరసింహారావు అన్నారు. ఈ క్రాప్ నమోదులో మిరప ఎక్కువగా సాగైనట్లు నమోదు కావడంతో శుక్రవారం మిరప సాగుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపడానికి ఆయన మండలంలోని ఓబిగానిపల్లి, ఒంటారెడ్డిపల్లి, మర్రిమాకులపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌సీలను సందర్శించి ఈ-పంట జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ ఓ గౌసియా, హార్టికల్చర్ అసిస్టెంట్ మల్లికార్జున, మోహన్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ.15,60,480



వీరభద్రస్వామి హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు పంచాయతీ పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి దేవాలయం హుండీ కానుకలను శుక్రవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 11 నెలలకుగాను రు.15,60,480 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ సాకే రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ రాణి, ఆయల కమిటీ చైర్మెన్ బసవరాజు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

రాయదుర్గంటౌన్: పట్టణ పరిధిలోని 20వ వార్డు పైతోటలో వాల్మీకి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాన్ని జయప్రదం చేయాలని వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప కోరారు. వాల్మీకి విగ్రహ దాత, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ప్రారంభిస్తారన్నారు. విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. శనివారం జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని వాల్మీకి కుటుంబ సభ్యులంతా హాజరై జయప్రదం చేయాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం కంబదూరు సెబ్ సీఐ మొహిద్దీన్ బాషా, అనంతపురం డీటీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసులు శెట్టూరు మండలంలోని బోదపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అడవి గొల్లపల్లి గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. అతడి నుంచి 480 ప్యాకెట్ల కర్ణాటక మద్యం, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

ఆదుకుంటాం.. అండగా ఉంటాం

ఉరవకొండ: స్థానిక డ్రైవర్స్ కాలనీకు చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు చిరంజీవి (30) వారం రోజుల క్రితం మృతి చెందాడు. శుక్రవారం మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. పార్టీలో ఎంతో చురుగ్గా పనిచేస్తున్న చిరంజీవిను కోల్పోవడం ఎంతో కలచి వేసిందన్నారు. అతడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, ఎంపీపీ చంద్రమ్మ, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, పార్టీ నాయకులు వశికేరిమల్లి, హనుమంతు, భీమా, అమర్నాథ్, తదితరులు ఉన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొసైటీ మాజీ డైరెక్టర్ సదానంద మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పాల్తూరు గ్రామానికి వెళ్లి సదానంద కుటుంబ సభ్యులు సర్పంచు బీవ్లారాణి, రాజశేఖర్, ఆనంద్‌రాజును పరామర్శించారు. ఎంపీటీసీ దాసరి వెంకటేశులు, నాయకులు పాటిల్ శివ, డిష్ వెంకటేశులు, ప్యాపిలి నాగరాజు పాల్గొన్నారు.



ఉరవకొండలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

నవంబర్ 8న విద్యాసంస్థల బంద్

రాయదుర్గంటౌన్: కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్న డిమాండ్లతో నవంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపడుతున్నట్లు విద్యార్థి యువజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఏపీ ఎన్జీవో భవనంలో ఒకే వేదికగా జిల్లా, నియోజకవర్గ స్థాయి విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు హాజరై సమావేశం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ సర్కారు ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనతోపాటు చేపడుతున్న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయస్వామి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగిశివ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, అంజి, హనుమంతరాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంటపాత్రల పంపిణీ

బ్రహ్మసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వంట సామగ్రి, పాత్రలు మంజూరయ్యాయి. శుక్రవారం ఎంఈఓ కృష్ణానాయక్ వంట పాత్రలను మండంలోని పాఠశాలల సిబ్బందికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో వంట పాత్రలు, సామగ్రిని అందజేశామన్నారు. వాటిని ఏజెన్సీ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు బసవరాజు, గోపాల్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: విద్యార్థులకు గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని నారాయణ ఈ-టెక్నో, శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థులతో వెళ్తున్న ఆటో శుక్రవారం బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని పలు కాలనీల నుంచి ఐదుగురు చిన్నారులను ఆటోలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లకు వెళ్తున్నారు. బళ్లారి రోడ్డులోని ప్రభుత్వాసుపత్రి వద్దకు రాగానే అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విహాన్, చారుహాన్, తన్వి అనే ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన విహాన్, చారుహాన్‌లను అనంతపురం తీసుకెళ్లారు. వీరంతా ఒకటి, రెండు తరగతి చదువుతున్నారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.